
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
ఆదివారం 21 జనవరి 2024



పేదరికం పెరిగింది

- ప్రజల గొంతుకగా పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీ
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

జహీరాబాద్, జనవరి 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా దేశంలో పేదరికం పెరిగిపోయిందని, దీంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతు ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు కమ్యూనిస్టుపార్టీ పాత్ర అత్యవసరమని అందరూ కోరుతున్నారన్నారు. కమ్యూనిస్టు లేకపోతే పేదల పక్షాన అడిగేవాడు లేడని ఆయన గుర్తుచేశారు. దేశంలో పాలకులు అవినీతి లేని సమాజాన్ని ఏర్పాటు చేయలేదని తెలిపారు. పదేళ్లలో గత పాలకుల పనితీరుపై విసుగు చెంది ప్రజలు రాష్ట్రంలో మార్పును కోరుకున్నారన్నారు. నీతి తప్పి పార్టీలు మారితే ప్రయోజనం ఉండబోదని, కమ్యూనిస్టు పార్టీలో ముఖ్యనేతలు స్వలాభపేక్షను పక్కనపెట్టి ప్రజల కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రాంతీయ పార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయని, అవినేడు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల నోట్లో నాలుకలా కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పనిచేస్తున్నదని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ప్రకాష్, నర్సింహా, జలాలోద్దీన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- మెదక్ రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో మనోజ్‌కుమార్

హవేళిఘణపూర్, జనవరి 20: అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ మెదక్ రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని గాజిరెడ్డిపల్లిలో అటవీ భూముల ఆక్రమణ విషయమై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు నమోదైతే వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవని తెలిపారు. త్వరలోనే ఫారెస్ట్ హద్దులు గుర్తించి చుట్టూ కందకాలు తీయిస్తామని పేర్కొన్నారు. అడవికి దగ్గరగా ఉన్న రైతులు భూమిని ఆక్రమిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు సభలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడేళ్ల క్రితం కందకం తీస్తామని చెప్పి ఎందుకు తీయలేదని అధికారులను యువకులు ప్రశ్నించారు. ఈసారి తప్పకుండా కందకం తీయిస్తామని అధికారులు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో శ్రీరామ్, నాయబ్ తహసీల్దార్ ప్రభాకర్, ఎస్ఐ ఆనంద్‌గౌడ్, సెక్షన్ ఆఫీసర్లు శ్రావణ్, గీత, గ్రామస్థులు పాల్గొన్నారు.



వెల్దుర్తి మండలంలోని చర్లపల్లి శివారులో నిలిచిపోయిన కాలువ నిర్మాణ పనులు

- మెదక్ జిల్లాలో ఐదు ప్యాకేజీలుగా పనులు
- మూడు ప్యాకేజీల పనులకు అతీగతీ లేదు
- ఐదు వేల ఎకరాల్లో దాదాపు రెండు వేల ఎకరాల భూసేకరణ మాత్రమే పూర్తి
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే పనులకు మోక్షం

భూసేకరణకు ఇంకెన్నాళ్లు!

ముందుకు కదలని కాళేశ్వరం కాలువల నిర్మాణం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్, జనవరి 20 : వేలాది ఎకరాలకు సాగు నీరు అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా తలపెట్టిన కాలువల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గత ప్రభుత్వం 2018-19లో కాళేశ్వరం కాలువల నిర్మాణ పనులను ప్రారంభించింది. కానీ ఐదేళ్లుగా భూసేకరణ దగ్గరే పనులు ఆగిపోయాయి. నిధుల సమస్యతో అధికారులు భూసేకరణపై దృష్టి సారించడం లేదు. తరచూ సమీక్షలు నిర్వహించడం తప్ప సాధించిన పురోగతి ఏ మాత్రం లేదు. గడువులోగా కాలువల నిర్మాణం చేస్తామని చెప్పడమే తప్ప పనుల చేయడం లేదు. ప్రతీ ఏటా గడువును పొడిగిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ దిగిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో కాళేశ్వరం కాలవల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

రూ.2,506 కోట్ల వ్యయంతో పనులు

మెదక్ జిల్లాలో కాళేశ్వరం కాలువల నిర్మాణ పనులను ఐదు ప్యాజీలుగా విభజించారు. ఇందుకోసం రూ.2,506 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు రూ.1,620 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. మిగిలిన రూ.886 కోట్ల నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో భూసేకరణ సమస్యగా మారింది. 14, 15 ప్యాకేజీ కింద చేగుంట, చిన్నశంకరంపేట, రామాయంపేట, నిజాంపేట మండలాల్లో 76 చెరువులను నింపి 19,452 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది అప్పటి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందు కోసం మెయిన్ కెనాల్ పనులను పూర్తి చేసి నీటిని విడుదల చేశారు. కానీ 79 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ కాలువల పని ఇప్పటికీ పూర్తి కాలేదు. జిల్లాలో వివిధ మండలాల పరిధిలోని 93 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు ఉద్దేశించిన ప్యాకేజీ 17, 18, 19 పనులు ఇంకా మొదలే కాలేదు.

పనుల గడువు పెంపు

17, 18, 19 ప్యాకేజీ పనులు 2022 సెప్టెంబర్‌లోపే పూర్తి చేయాల్సి ఉంది. అయితే భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ప్రతిసారి గడువు పొడిగిస్తూనే ఉన్నారు. ప్యాకేజీ 17, 18 పనులు 2023 డిసెంబరు నెలాఖరుకు, ప్యాకేజీ 19 పనులు 2024 డిసెంబర్ వరకు పూర్తి చేసేలా గడువు పొడిగించారు. కాలం గడిచిపోతున్నా కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో అనుకున్న గడువులోగా పనులు పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కాలువల నిర్మాణంపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం ఏమేరకు ప్రాధాన్యంగా భావిస్తుందో చూడాలి. కాంగ్రెస్ సర్కారు దీనిపై దృష్టిసారించకుంటే కాలువల నిర్మాణం ఇక ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుంది.

పూర్తి కాని భూసేకరణ

కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజీ 17 పనుల్లో 4,575 మీటర్ల దూరం మెయిన్ కెనాల్ 18.62 కిలోమీటర్ల టన్నెల్ నిర్మించాల్సి ఉంది. ఈ పనులు చేపట్టేందుకుగాను 402 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అందులో ఇప్పటివరకు 382 ఎకరాలను సేకరించారు. మిగతా 20 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ప్యాకేజీ 18 ద్వారా కౌడిపల్లి, వెల్దుర్తి, కొల్చారం మండలాల పరిధిలో 15వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుగాను ఆయా మండలాల పరిధిలో 36 కిలోమీటర్ల దూరం మెయిన్ కెనాల్ 3.9 కిలోమీటర్ల దూరం టన్నెల్ నిర్మించాల్సి ఉంది. ఈ పనులు చేపట్టేందుకు 1,289 ఎకరాల భూమిని సేకరించాలి. 800 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఇంకా 489 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉన్నది. ప్యాకేజీ 19 ద్వారా చిలప్‌చెడ్, కౌడిపల్లి, కొల్చారం, టేక్మాల్, పాపన్నపేట, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం మండలాల్లో 60,473 ఆయకట్టుకు సాగునీటిని అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం 12 కిలోమీటర్ల దూరం మెయిన్ కెనాల్ 75.2 కిలోమీటర్ల దూరం బ్రాంచ్ కెనాల్ నిర్మించాల్సి ఉంది. ఈ పనులను చేపట్టేందుకు ఆయా మండలాల పరిధిలో 3,100 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఇప్పటివరకు 452 ఎకరాలను మాత్రమే సేకరించారు. ఇంకా 2,648 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. మొత్తంగా మూడు ప్యాకేజీల్లో దాదాపు ఐదు వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా దాదాపు రెండు వేల ఎకరాల వరకే పూర్తయింది. ఇంకా మూడు వేల ఎకరాల సేకరణ పెండింగ్‌లోనే ఉంది.

నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామం దగ్గర నిర్మించిన టన్నెల్



వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- భర్తను హత్య చేయించిన భార్య
- మాజీ ప్రియుడితో కలిసి ఘాతుకం
- అందోలులో రాయితో కొట్టి కారులో ఎత్తుకెళ్లారు
- గొంతునులిమి ఊపిరాడకుండా చంపేశారు
- మెదక్ జిల్లా కోనాపూర్‌లో దహనమై లభించిన మృతదేహం
- భార్య, మాజీ ప్రియుడితో పాటు సహకరించిన నలుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి డీఎస్పీ రమేష్ కుమార్



చాకలి మల్లేశం(ఫైల్)

జోగిపేట/రామాయంపేట, జనవరి 20 : మాజీ ప్రియుడిపై ఇష్టంతో ఓ మహిళ భర్తను దారుణంగా హత్య చేయించింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో భర్తను చంపేయించిన ఘటన శనివారం వెలుగుచూసింది. జోగిపేట పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్ వివరాలను వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. జోగిపేటకు చెందిన చాకలి మల్లేశం(30)కు ఇటీవల అందోలులో డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరవడంతో భార్య కల్పనతో కలిసి అందులో నివసిస్తున్నాడు. మల్లేశం జోగిపేటలో ఇస్త్రీ దుకాణం నడుపుతున్నాడు. మల్లేశం భార్య కల్పనకు పెళ్లి కంటే ముందే తన చిన్ననాటి స్నేహితుడైన మచ్చూరి మహేశ్‌ను ప్రేమించింది. పెళ్లయిన తరువాత కూడా మహేశ్ ఆమెతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలో కల్పన తన భర్త మల్లేశంను హత్య చేయిస్తే తమకు అడ్డు ఉండదనుకున్నది. భర్తను మట్టుబెట్టాలని మచ్చూరి మహేశ్‌కు తెలిపింది. అతడు మరో ముగ్గురితో కలిసి హత్యకు పతకం పన్నాడు. వారికి కొంత సొమ్ము చెల్లించాలని మహేశ్ చెప్పడంతో ఆమె రూ.50 వేలు సుపారీ చెల్లించేందుకు ఒప్పుకున్నది. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున ఎప్పటిలాగే మల్లేశం తన ఇంటి నుంచి ఇస్త్రీ దుకాణానికి వెళ్లడానికి స్కూటీపై బయలుదేరాడు. ముందుగా రెక్కీ నిర్వహించి పతకం రచించిన దుండగులు అందోలులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వెనక దారిలోకి చాకలి మల్లేశం రాగానే తలపై బండరాయితో గట్టిగా బాదారు. దీంతో కింద పడిన మల్లేశంను మహేశ్‌తో పాటు అతడి స్నేహితులు ఉసికె అంబాజీ, రంగంపేటకు చెందిన ఒకరు, గంగారం గ్రామాలకు చెందిన ఇద్దరితో కలిసి కారులో కిడ్నాప్ చేశారు. వారు మల్లేశంను కారులోనే గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం మల్లేశం మతదేహాన్ని కారులో మొదటగా మెదక్ వైపు ఆ తర్వాత రామాయంపేట మీదుగా సిద్దిపేట రోడ్డులో తీసుకెళ్లారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధిలోని నిర్జనంగా ఉన్న కోనాపూర్ చెరువు వద్ద ఆగారు. మల్లేశం మృతదేహాన్ని ఆనవాలు లేకుండా చేసేందుకు పెట్రోల్ చల్లి నిప్పంటించి దహనం చేశారు. అయితే తన కుమారుడు కనిపించడం లేదంటూ మృతుడి తల్లి పాపన్నపేట రాజమణి శుక్రవారమే జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇంతలో శనివారం ఉదయం రామాయంపేట మండలం కోనాపూర్ శివారు చెరువు కట్ట కింది భాగాన శవం పడి ఉన్నట్లు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం వచ్చింది. రామాయంపేట ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కిడ్నాప్ కేసు గురించి తెలియడంతో జోగిపేట పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని మృతదేహం దహనమై లభించిందని వారికి తెలిపారు. జోగిపేట పోలీసులు వెళ్లిచూడగా మృతదేహం మల్లేశందేనని గుర్తించారు. దర్యాప్తులో భాగంగా, మొదటగా మల్లేశం భార్య కల్పనను పోలీసులు విచారించగా అసలు విషయాలు బయటపడ్డాయి. తనకు పెళ్లికి ముందే తమ గ్రామమైన మాసాన్‌పల్లికి చెందిన మచ్చూరి మహేశ్‌ను ప్రేమించానని పెళ్లి మల్లేశతో జరిగినప్పటికీ, తనకు మహేశ్‌కు మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతూనే ఉందని కల్పన తెలిపింది. మృతుడి భార్య కల్పన వాంగ్మూలం మేరకు హత్యకు పాల్పడ్డ మచ్చూరి మహేశ్‌తో పాటు మల్లేశం భార్య కల్పన, హత్యకు సహకరించిన ఉసికె అంబాజీ, మరో ముగ్గురిని శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ రమేశ్ తెలిపారు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించిన జోగిపేట సీఐ నాగరాజు, ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్, సిబ్బందిని డీఎస్పీ రమేశ్ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్‌కుమార్

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎవరో?

- 29న చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు



నర్సాపూర్, జనవరి 20 : నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న మురళీధర్‌యాదవ్ రాజీనామా చేయడంతో ఆ పదవీ కోసం బీఆర్ఎస్ కౌన్సిలర్లు పావులు కదుపుతున్నారు. గత నెలలో బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది కౌన్సిలర్లు మురళీధర్ యాదవ్‌పై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా 9 బీఆర్ఎస్, 6 బీజేపీకి చెందిన వారు. బలం లేకపోవడంతో బీజేపీ నేత మురళీధర్‌యాదవ్ చైర్మన్ పదవికి ఈనెల 4న రాజీనామా చేశారు. దీంతో ఆయన స్థానంలో వైస్ చైర్మన్‌గా ఉన్న నయిమోద్దీన్‌కు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. 29న కొత్త చైర్మన్ ఎన్నికకు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్‌కు చెందిన ఒకటో వార్డు కౌన్సిలర్ అశోక్‌గౌడ్‌ను చైర్మన్ చేసేందుకు పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు తెలిసింది. అయితే తాత్కాలిక చైర్మన్ నయిమోద్దీన్ కూడా పదవిని ఆశిస్తున్నారు. దీంతో ఇద్దరి మధ్య పోటీ నెలకొన్నది. వారి మధ్య సయోధ్య కుదర్చడానికి స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఆర్టీసీకి కలిసొచ్చిన సంక్రాంతి పండుగ

- మెదక్ రీజియన్‌కు రూ.4.79 కోట్ల ఆదాయం
- తిరుగు ప్రయాణాలతో భారీగా రాబడి

సంగారెడ్డి అర్బన్, జనవరి 20: ఆర్టీసీకి సంక్రాంతి పండుగ కలిసొచ్చింది. సొంతూళ్లలో పండుగ చేసుకునేందుకు ప్రయాణికులు భారీగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. హైదరాబాద్ తదితర నగరాల్లో స్థిరపడిన వారి కోసం ఆర్టీసీ ఎనిమిది డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపడంతో మెదక్ రీజియన్‌కు రూ.4.79 కోట్ల ఆదాయం సమకూరింది. పండుగకు ముందు 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రూ.3.57 కోట్ల ఆదాయం సమకూరగా, పండుగ తర్వాత మూడురోజులు రూ.4.79 కోట్ల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఈసారి పండుగకు అదనపు ట్రిప్పులను నడిపించిన ఎలాంటి ప్రత్యేక ఛార్జీలు లేకుండా సాధారణ ఛార్జీలను మాత్రమే వసూలు చేశారు. మెదక్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, మెదక్, నర్సాపూర్, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, సిద్దిపేట డిపోల పరిధిలో 16న 91.48 లక్షలు, 17న 1.37 కోట్లు, 18న 1.31 కోట్లు, 19న 1.18 కోట్ల ఆదాయం వచ్చింది. 16 నుంచి 19వ తేదీ వరకు 4.79 కోట్ల రాబడి వచ్చింది.

మెగా ఇన్వెంటివ్ ఫెయిర్ అదరహో

- ఐఐటీహెచ్‌లో ఆకట్టుకున్న ఆవిష్కరణలు
- ముగిసిన ఇన్నోవేషన్ ప్రదర్శన

కంది, జనవరి 19: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో మెగా ఇన్వెంటివ్ ఇన్నోవేషన్ 2024 పేరుతో రెండురోజులపాటు కొనసాగిన ఫెయిర్ శనివారం ముగిసింది. ఈ ప్రదర్శనలో దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలతో పాటు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కలిగిన 120 ఉన్నత విద్యాసంస్థలు పాల్గొన్నాయి. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వాతావరణ మార్పు, ఇ-మొబిలిటీ, క్లీన్ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణ, అంతరిక్షం, పరిశ్రమలు వంటి ఐదు కీలక అంశాలపై సరికొత్త ఆవిష్కరణల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఫెయిర్‌ను చూడడానికి ఐఐటీహెచ్‌కు వివిధ కళాశాలల నుంచి వేలాదిగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు తరలివచ్చారు. పారిశ్రామికవేత్తలతో ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి టెక్నాలజీ మార్పిడి ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇన్వెంటివ్-2024లో శాస్త్ర సాంకేతిక రంగాలకు, పరిశ్రమలకు చెందిన నిపుణుల సమావేశంగా మాత్రమే భావించరాదని, దేశపురోగతికి, ఉపాధి కల్పనకు, కొత్త ఆవిష్కరణల దిశగా యువతను ప్రోత్సహించే గొప్ప వేదిక అని అన్నారు. స్టార్టప్‌లు యువ పారిశ్రామికవేత్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయన్నారు. ప్రపంచ సవాళ్లను అధిగమించే సాంకేతిక పురోగతులను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా ఈ సదస్సు ఉత్తమ వేదికగా పనిచేస్తున్నదని వివరించారు. మెగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్‌అండ్‌డీ) ఫెయిర్ 2వ ఎడిషన్‌లో సాంకేతికపరంగా మరో ముందడుగు వేసిందని మూర్తి అభిప్రాయపడ్డారు.



ఐఐటీ ఢిల్లీ పరిశోధకులు తయారుచేసిన బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్

పరిశోధక విద్యార్థులు ఆవిష్కరణలు

పలు విద్యాసంస్థల పరిశోధక విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఐఐటీ ఢిల్లీ పరిశోధకులు తయారుచేసిన అధునాతన బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ శక్తివంతమైన స్నైపర్‌గన్ బుల్లెట్‌నైనా తట్టుకునేలా రూపొందించారు. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌ను ఆరు దశల్లో పరీక్షించామన్నారు. శత్రుమూకల దాడి నుంచి సైనికులను రక్షించుకునేందుకు ఐఐటీ ఢిల్లీ పరిశోధకులు తయారుచేసిన అధునాతన బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ఆకట్టుకున్నది. ఇది శక్తివంతమైన స్నైపర్‌గన్ బుల్లెట్‌నైనా తట్టుకునేలా తయారుచేశామని తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థ నీటితో లిక్విడ్ ఎరువును నాన్ థర్మల్ ప్లాస్మా టెక్నాలజీని ఉపయోగించి ఐఐటీ తిరుపతి పరిశోధక విద్యార్థులు తయారుచేశారు. ఇండస్ట్రియల్ వేస్ట్ వాటర్ ద్వారా జీవవైవిధ్యానికి ఆటంకం కలగకుండా చేయాలనే ఆలోచనతో విద్యార్థులు ఈ ప్లాస్మా టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ఐఐటీ జోధ్‌పూర్ విద్యార్థులు శస్త్రచికిత్సల అనంతరం పాడైపోయిన మానవ శరీర భాగాలను కృత్రిమ కలర్స్‌తో తిరిగి అమర్చే ఏఐ అనుసంధానంతో పనిచేసే సిలికాన్ టెక్నాలజీని రూపొందించారు. డిజిటల్ ఆప్టికల్ టెక్నాలజీ ఉపయోగించి స్కానర్‌తో స్కానింగ్ చేసి శరీరంలో దెబ్బతిన్న భాగాలను మునపటిలా అమరుస్తారు.



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న విద్యార్థులు

సీఎంఆర్ పూర్తి చేయకపోతే చర్యలు

- మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తాం
- ఆర్ఆర్ యాక్ట్ కింద 125 శాతం రికవరీ చేస్తాం
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా హెచ్చరిక



సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా

మెదక్, జనవరి 20: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా రైస్‌మిల్లర్లను హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిల్లుల యాజమాన్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెలాఖరు వరకు గడువు ఇచ్చిందని, అప్పటిలోగా బియ్యం ఇవ్వని మిల్లుల యాజమానులపై ఆర్ఆర్ యాక్ట్ కింద స్థిర, చర ఆస్తులు జప్తు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే రైస్ మిల్లర్ల నుంచి 125 శాతం రికవరీ చేస్తామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం తరఫున వాటిని పరిష్కారిస్తామన్నారు. సమావేశంలోఅదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్‌వో బ్రహ్మారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రామాయంపేట, జనవరి 20: భార్యాభర్తల గొడవల వల్ల ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టాయిలెట్లు శుభ్రంచేసే హార్పిక్ తాగిన అర్చన శనివారం రామాయంపేట ఆర్టీసీ బస్టాండులో అపస్మారక స్థితిలో పడిపోయింది. అక్కడే ఉన్న ప్రయాణీకులు పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నవోదయ 6వ తరగతి
ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు
- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 5796, పరీక్షకు హాజరైనవారు 3703 మంది

వర్గల్, జనవరి 20: మానవ వనరులశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుపుతున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఉమ్మడి మెదక్ (సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్) జిల్లాలవ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ముగిసినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డీ.రాజేందర్ తెలిపారు. నవోదయ 6వ తరగతి ప్రవేశానికి 80 సీట్లకు ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 5796 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 3703 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. 2093 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో 1501 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 933 మంది పరీక్ష రాశారు. సంగారెడ్డి జిల్లాలో 2113 మంది విద్యార్థులకు 1359 మంది, సిద్దిపేట జిల్లాలో 2182 మందికి 1411 మంది పరీక్ష రాశారని తెలిపారు. మెదక్ జిల్లాలో 568 మంది, సంగారెడ్డి జిల్లాలో 754 మంది, సిద్దిపేట జిల్లాలో 771 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థుల శాతం 63.89 కాగా గైర్హాజరైన విద్యార్థుల శాతం 36.11 అని చెప్పారు. గజ్వేల్ సెయింట్ జోసఫ్ బాలికల విద్యాలయంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులను గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఎంఈవో సునీత పర్యవేక్షించినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డీ.రాజేందర్ తెలిపారు.

అల్లీనగర్‌ను పంచాయతీగా మార్చాలి


పంచాయతీ ఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ ప్రకాశంచారి, వార్డు సభ్యులు

జిన్నారం, జనవరి 20: గడ్డపోతారం పంచాయతీ పరిధి నుంచి తమ గ్రామాన్ని వేరు చేసి నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని అల్లీనగర్‌వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అల్లీనగర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు వీరేశ్, స్థానిక నాయకులు సర్పంచ్ ప్రకాశంచారితో కలిసి ఈవో వెంకట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గడ్డపోతారం పంచాయతీ పరిధిలో ఉన్న అల్లీనగర్‌ను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే తమ గ్రామం అభివృద్ధిలో ముందుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్, జనవరి 20: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి అధ్యక్షతన గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలంలోని గ్రామాల్లు జరిగిన అభివృద్ధి, సమస్యల గురించి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ నిధులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని సూచించారు. ప్రతీ సమావేశానికి హాజరై గ్రామ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో శశిప్రభ, పీఆర్ఏఈ మధుబాబు, ఏపీవో శ్యాంకుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


గుమ్మడిదలలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలి

శివ్వంపేట: గ్రామస్థాయిలో అన్ని శాఖలకు చెందిన అవసరమైన నిధుల విషయమై అధికారులు సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని ఎంపీపీ హరికృష్ణ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష సమావేశంలో ఎంపీపీ హరికృష్ణ, ఎంపీడీవో భారతి పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి సమగ్ర సమాచారాన్ని ఈ నెల 27లోగా సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరువతాయని తెలిపారు. సమావేశంలో ఎంపీవో తిరుపతిరెడ్డి, వైద్యాధికారి సాయిసౌమ్య, ఏఈలు భాస్కర్, వరాలబాబు తదితరులు పాల్గొన్నారు.


చిలప్‌చెడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ

గుమ్మడిదల: గుమ్మడిదలలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసేందుకు గ్రామసభ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సిమెంట్, స్టీల్ దుకాణంలో భారీ చోరీ

● పైకప్పును తొలగించి రూ.7.10 లక్షల నగదు అపహరణ


పైకప్పును తొలగించిన దృశ్యం

తూప్రాన్, జనవరి 20: సిమెంట్, స్టీల్ సామగ్రి విక్రయ దుకాణ పైకప్పు రేకులను తొలగించిన దుండగులు రూ.7.10 లక్షల నగదు చోరీ చేశారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్‌ఐ శివానందం, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణంలోని వివేకానంద కాలనీకి చెందిన మామిండ్ల శ్రీకాంత్ పాత హైవే రోడ్డుపై నటరాజ్ ఎంటర్‌ప్రైజెస్ షాపు ఏర్పాటు చేసి, స్టీల్, సిమెంట్, సెంట్రింగ్ బాక్స్‌లను విక్రయిస్తుంటాడు. రెండురోజులు అమ్మకం ద్వారా వచ్చిన రూ.7.10 లక్షల నగదును షాపు ఆఫీస్ కౌంటర్‌లో ఉంచి శుక్రవారం రాత్రి 8.30 గంటలకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం 7.45 గంటలకు వెళ్లి తాళం తీసి చూడగా షాపు సీలింగ్ పగులగొట్టి, పైకప్పు రేకులు విప్పి ఉన్నాయి. కౌంటర్‌లో పరిశీలించగా నగదు కనిపించలేదు. రూ.7.10లక్షలతో పాటు షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉంచిన డీవీఆర్‌ను సైతం దుండగులు ఎత్తుకెళ్లారు. శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


సాధు (ఫైల్)

హవేళిఘణపూర్, జనవరి 20: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళిఘణపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి సాధు(38) ప్రైవేటు బస్సు నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అప్పు చేసి ఇంటిని నిర్మించాడు. అప్పులు అధికంగా కావడంతో ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఎల్లవ్వ, కూతురు ఉన్నారు. కాగా ఈ విషయమై ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

బస్టాండులో మహిళ ఆత్మహత్యాయత్నం

రామాయంపేట, జనవరి 20: రామాయంపేటలోని ఆర్టీసీ బస్టాండులో శనివారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్తతో గొడవల కారణంగా సదరు మహిళ టాయిలెట్లు శుభ్రం చేసే హార్పిక్ తాగి రామాయంపేట ఆర్టీసీ బస్టాండులో అపస్మారక స్థితిలో పడిపోయింది. అక్కడే ఉన్న ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వాహనంలో మహిళను ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు 24మంది ఎంపిక

చేగుంట, జనవరి 20: రాష్ట్రస్థాయి టచ్ రగ్బీ పోటీలకు 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్‌లు కరణం గణేష్, రవికుమార్ శనివారం తెలిపారు. చేగుంట ఆదర్శ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి టచ్ రగ్బీ పోటీలకు 200 మంది పాల్గొనగా.. 12మంది బాలురు, 12మంది బాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి, పీడీ వెంకటేష్, సతీష్, రఫీ, రెఫరీలు బాలరాజ్, చంటి పాల్గొన్నారు.

రూ.లక్ష ఎల్‌వోసీ అందజేత

మాసాయిపేట: హకీంపేట గ్రామానికి చెందిన బి.నవ్యకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీ పత్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి శనివారం అందజేశారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

పెద్దశంకరంపేట: రోమోజీపల్లిలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో బాసాడ సురేష్, శ్రీశైలం, వెంకటేశంకు చెందిన మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామ శివారులో తెగిపడిన విద్యుత్ వైర్లకు మూడు గేదెలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి.

సంధ్యకు డాక్టరేట్

పటాన్‌చెరు రూరల్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ పీహెచ్‌డీ విద్యార్థిని పి.సంధ్యను డాక్టరేట్ వరించింది. పర్యావరణ, జీవ సంబంధ అనువర్తనాల కోసం మెటల్, మెటల్ ఆక్సైడ్ సూక్ష్మ సమ్మేళనాలు అనే అంశంపై చేసిన అధ్యయానికి సంధ్య డాక్టరేట్ సాధించింది.

చట్టాలపై అవగాహన

నారాయణఖేడ్: మండల పరిధిలోని అబ్బెంద, చాప్టాకె గ్రామాలతోపాటు సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్ గ్రామంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సూచనల మేరకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ప్యానల్ న్యాయవాదులు ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కేంద్రానికి వ్యతిరేకంగా సీఐటీయూ సమ్మె

జిన్నారం, జనవరి 20: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య తెలిపారు. శనివారం కాజీపల్లిలో సీఐటీయూ క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులు, రైతులు, ప్రజలకు మేలు చేయకుండా సంపన్నవర్గాలకే లాభం చేకూర్చేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఇందుకు నిరసనగా దేశవ్యాప్త గ్రామీణ బంద్ జరుపనున్నట్లు రాజయ్య తెలిపారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తయ్య, ప్రభు, నర్సింహగౌడ్, నరేష్, రామకృష్ణ, యుసుబ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేనేత విభాగం

జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవికుమార్

సదాశివపేట, జనవరి 20: కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సదాశివపేట 6వ వార్డు కౌన్సిలర్ గుండు రవికుమార్ నియామకమయ్యారు. శనివారం చేనేత విభాగం జిల్లా చైర్మన్ ప్రవీణ్‌బాలే చేతుల మీదుగా రవికుమార్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చేనేతల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నియమాలు పాటించాలి

పెద్దశంకరంపేట, జనవరి 20: వాహనదారులు రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు ఐఎంఎస్ మేనేజర్ ఖాజామైనోద్దిన్ సూచించారు. జాతీయ రహదారి భద్రత ఉత్సవాల్లో భాగంగా శనివారం పెద్దశంకరంపేట శివారులోని జాతీయ రహదారిపై పోలీస్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది, ప్రాజెక్టు హైవే పెట్రోలింగ్ సిబ్బంది వాహనదారులకు అవగాహన కల్పించారు. పలు వాహనాలకు వెనుక వైపున ఎరుపు, పసుపు రంగుల స్టిక్కర్లను అతికించి, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పోలింగ్ హైవే పెట్రోలింగ్ ఏఎస్‌ఐ షరీఫ్ కృష్ణయ్య, వీఆర్వో శివకుమార్, ఆర్బీవో ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్ ద్వారా ఎరువులను విక్రయించాలి

పెద్దశంకరంపేట, జనవరి 20: రైతులకు ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. శనివారం పెద్దశంకరంపేటలోని వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని సూచించారు. యాసంగి పంటలకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఏఈవోలు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అల్లాదుర్గం, రేగోడు, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాల ఎరువుల దుకాణాల డీలర్స్, ఏడీఏ రాంప్రసాద్, వ్యవసాయ అధికారులు రాజేష్‌కుమార్, జావేద్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చిన్నశంకరంపేట: ఎరువులను సంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ హెచ్చరించారు. శనివారం చిన్నశంకరంపేటలోని రైతు ఆగ్రో కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఎరువుల దుకాణాదారులు తప్పనిసరిగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో శ్రీనివాస్, ప్రవీణ్‌గుప్తా ఉన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు

కౌడిపల్లి, జనవరి 20: సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండడంతో మీజీ వైస్ ఎంపీపీ సున్నం సతీష్ ఆధ్వర్యంలో ముత్రాజ్‌పల్లి గ్రామ పాలకవర్గానికి శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఐదు సంవత్సరాల పాటు సుపారిపాలన అందజేసిన పాలకర్గ సభ్యులను ముత్యాలమ్మ ఆలయం వద్ద సన్మానించారు. అనంతరం గ్రామ ఉపసర్పంచ్ వెంకటేశంకు రూ.7లక్షల విలువైన కారును బహుకరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తిమ్మపూర్ లక్ష్మి, సందిరి నర్సింహులు, తలారి కిషన్, కాట్రోత్ మోతి, రహీమ సుల్తాన్, సునావత్ సురేష్, గోల్ల పోచమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 12 వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంపిక

● మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా


జిల్లాస్థాయి ప్రదర్శనల ఫలితాలను విడుదల చేస్తున్న కలెక్టర్

మెదక్ అర్బన్, జనవరి 20: జిల్లాలోని ఉన్నత పాఠశాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల ఫలితాలను శనివారం కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 181 ప్రాజెక్టులు ప్రదర్శనల కోసం నమోదు చేసుకోగా.. వీటిలో ఉత్తమ పది ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. మొత్తం ఐదు అంశాల్లో సీనియర్, జూనియర్ విభాగాలుగా ప్రతి అంశంలో ముగ్గురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. టీచర్, సెమినార్ ఎగ్జిబిట్లతో కలిపి మొత్తం 12 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థులు వర్చువల్ పద్ధతిలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం విజేతలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలి

● జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి


కోహీర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

కోహీర్, జనవరి 20: బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. శనివారం కోహీర్‌లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో జహీరాబాద్ సెగ్మెంట్‌లో బీజేపీ గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేస్తే ఎన్నికల్లో గెలుపు సాధ్యమవుతుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వైద్యనాథ్, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభరి మహిపాల్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి మల్లికార్జున్ పాటిల్, నాయకులు సతీష్‌రెడ్డి, కిష్టన్న, అంజనేయులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

● వైద్య శిబిరాల ఏర్పాటు


చౌటకూర్‌లో పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సంగారెడ్డి అర్బన్/పుల్‌కల్, జనవరి 20: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు ఐబీ ఆవరణలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవసరమైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, జీజీహెచ్ ఆర్ఎంవో వీరాంజనేయులు, ఇంద్రనగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మనుజారెడ్డి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శనివారం చౌటకూర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్కూరి వీరమణిమొగులయ్య, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, ఈజీఎస్ క్షేత్రస్థాయి సహాయకురాలు అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గీతం యూనివర్సిటీని సందర్శించిన సంగారెడ్డి కలెక్టర్

● స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు రూరల్, జనవరి 20: రుద్రారం గీతం యూనివర్సిటీని శనివారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేష్‌తో కలిసి సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లకు అవసరమైన స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లను పరిశీలించారు. ఈవీఎంల భద్రత, పోలీస్ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చించారు. ఆమెవెంట అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో నగేష్, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల అధికారులు ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో రజత పతకం


రజత పతకం సాధించిన నర్సాపూర్ గురుకుల విద్యార్థులు

నర్సాపూర్, జనవరి 20: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు రజత పతకం సాధించారని శనివారం ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. అండర్-14 విభాగంలో మెదక్ జిల్లా తరపున నర్సాపూర్ సాఫ్ట్‌బాల్ అకాడమికి చెందిన 10మంది బాలురు పాల్గొని రజత పతకం సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన సంతోష్, రాహుల్ ఫిబ్రవరి 3 నుంచి 6వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ జట్టు తరపున పాల్గొంటారని చెప్పారు.

తారా కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 20: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పరిశోధన-జీవశాస్త్రంలో నవీన సరళులు అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. చివరి రోజు నాలుగు సాంకేతిక విభాగాల్లో హెచ్‌సీయూ వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్లు సుబ్రహ్మణ్యం, రాజగోపాల్, మను, జంతు శాస్త్ర విభాగాధిపతి పర్వీన్‌జహాన్, గీతం విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం నుంచి స్వరూపరాణి, మైక్రోబయోలజీ విభాగం నుంచి సునీత జీవశాస్త్ర రంగంలో జరిగే నూతన ఆవిష్కరణల గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ జీవశాస్త్రంలో నవీన సరళులు పరిశోధన అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, జంతుశాస్త్ర విభాగాధిపతి రమేశ్‌బాబు, సదస్సు సంచాలకులు మిథున్‌కుమార్ రాథోడ్, వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోపాజి అనంతకృష్ణ పాల్గొన్నారు.

లచ్చునాయక్ తండాలో పాతపంటల జాతర


పాతపంటలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జహీరాబాద్, జనవరి 20: మండలంలోని లచ్చునాయక్ తండాలో శనివారం డీడీఎస్ ఆధ్వర్యంలో 24వ పాతపంటల జాతరను నిర్వహించారు. పాతపంటల ప్రాముఖ్యతను జాతర కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్ వివరించారు. చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, చిరుధాన్యాలను రైతులు ఎక్కువగా రైతులు సాగుచేయాలని ఆయన కోరారు. అనంతరం చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, డీడీఎస్ సిబ్బంది విజయలక్ష్మి, మంజుల, వినయ్‌కుమార్, జనరల్ నర్సమ్మ, చుక్కమ్మ, పూలమ్మ, అల్గోల్‌నర్సమ్మ, చంద్రమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో నకిలీ ఓటర్లను తొలగించాలి

● మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 20: ఓటరు జాబితాలో ఉన్న నకిలీ, డబుల్ ఓటర్లను తొలగించాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. శనివారం మెదక్ పట్టణంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంతో పాటు కొల్చారం మండల పరిధిలోని అప్పాజిపల్లిలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల పరిధిలో ఓటర్ల సంఖ్య, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాసులు, తహసీల్దార్లు, బీఎల్‌వోలు ఉన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

మనోహరాబాద్: మనోహరాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మనోహరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన పరిశీలించి, బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయనవెంట డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ దీక్షిత్, సిబ్బంది ఉన్నారు.

●కల్హేర్: కల్హేర్ మండల పరిధిలోని క్రిష్టాపూర్‌లో ఓటరు నమోదు ప్రక్రియను నారాయణఖేడ్ ఆర్డీవో వెంకటేష్ పరిశీలించారు. ఆర్డీవో వెంట కల్హేర్ తహసీల్దార్ బాలాశంకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, సర్పంచ్ కిష్టారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుకారాం, రవీందర్ ఉన్నారు.

●హత్నూర: హత్నూర మండలంలోని హత్నూర, దౌల్తాబాద్, సాదుల్లానగర్ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సంధ్య ఉన్నారు.

●కోహీర్: జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు కోహీర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ప్రారంభించారు. కోహీర్‌లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ శాంతకుమారి పరిశీలించారు. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని తారా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై సంగారెడ్డి తహసీల్దార్ పర్వీన్ షేక్ అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతీ ఒక్కరు గుర్తించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటుకు దేశ భవిష్యత్తును మార్చే శక్తి ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల చేత ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు.


మనోహరాబాద్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


హత్నూరలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్